సాక్షి
అన్నమయ్య జిల్లా

శుక్రవారం । 28 । మార్చి । 2025

I



కూటమి నేతల భూ కబ్జా

ఖాళీగా కనిపించిన ప్రభుత్వ స్థలాలపై అధి కార పార్టీ నాయకుల కన్నుపడింది. అనుకున్నదే తడువుగా రికార్డులను సృష్టించి ఆక్రమణలో మేటిగా నిలుస్తున్నారు. -IIలో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శుక్ర॥ (సా॥)	సహార్ శని॥ (ఉ॥)
రాయచోటి	6.31	4.55
రాజంపేట	6.29	5.00
పీలేరు	6.31	4.52
మదనపల్లె	6.33	4.55

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.90	రూ.110
రెండోరకం	రూ.60	రూ.80



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 108 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
సీబీ	430	555
బైవోల్టిన్	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 271.120 కిలోలు

- బ్రహ్మంగారిమఠం జెడ్పీటీసీ ఎం.రామగోవిందరెడ్డి ఎన్నిక
- ఎన్నికల్లో పాల్గొన్న 41 మంది జెడ్పీటీసీలు
- టీడీపీ, వైఎస్సార్‌సీపీ ఫిరాయింపు జెడ్పీటీసీలు గైర్హాజరు
- చైర్మన్ చేత ప్రమాణ స్వీకారం చేయించిన కలెక్టర్

జెడ్పీ చైర్మన్ ఏకగ్రీవం



జెడ్పీ సీఈఓకు నామినేషన్ పత్రం అందిస్తున్న రామగోవిందరెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్పీటీసీలు



ధృవీకరణ పత్రాన్ని రామగోవిందురెడ్డికి అందజేస్తున్న వైఎస్సార్ కడప జిల్లా కలెక్టర్ శ్రీధర్‌చెరుకూరి



జెడ్పీ చైర్మన్ ఎన్నిక సందర్భంగా ప్రత్యేక సమావేశానికి హాజరైన జెడ్పీటీసీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

సాక్షి ప్రతినిధి, కడప: వైఎస్సార్ జిల్లా జెడ్పీ చైర్మన్ ఎన్నిక ఏకగ్రీవంగా ముగిసింది. వైఎస్సార్‌సీపీ బ్రహ్మంగారిమఠం జెడ్పీటీసీ సభ్యుడు ముత్యాల రామగోవిందరెడ్డి జెడ్పీ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గురువారం జెడ్పీ చైర్మన్ ఎన్నిక కోసం కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి 41 మంది జెడ్పీటీసీలు హాజరయ్యారు. వైఎస్సార్ జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ పదవికి అభ్యర్థిని ప్రతిపాదించాలని కలెక్టర్.. జెడ్పీటీసీ సభ్యులను కోరడంతో పోరుమామిళ్ల జెడ్పీటీసీ సభ్యుడు ముత్యాల ప్రసాద్ అలియాస్ చెన్నయ్య, వేముల జెడ్పీటీసీ సభ్యుడు కోకటం వెంకటబయపురెడ్డిలు బి.మఠం జెడ్పీటీసీ సభ్యుడు ముత్యాల రామగోవిందరెడ్డి పేరును ప్రతిపాదించడంతో పాటు ఆయన అభ్యర్థిత్వాన్ని బలపరిచారు. తదుపరి ఏ ఒక్క అభ్యర్థి పేరును కూడా జెడ్పీటీసీ సభ్యులు ప్రతిపాదించలేదు. ఆ విషయాన్ని మూడు పర్యాయాలు.. ఎన్నికల అధికారైనా కలెక్టర్ కోరారు. రెండవ పేరు ప్రతిపాదన రాకపోవడంతో బి.మఠం జెడ్పీటీసీ ముత్యాల రామగోవిందురెడ్డిని వైఎస్ఆర్ జిల్లా పరిషత్ చైర్మన్‌గా జిల్లా ఎన్నికల అధికారి ప్రకటించారు. అనంతరం వైఎస్ఆర్ జిల్లా పరిషత్ చైర్మన్‌గా ముత్యాల రామగోవిందురెడ్డితో జిల్లా కలెక్టర్ ప్రమాణ స్వీకారం చేయించారు. చైర్మన్‌గా ఎన్నికైన రామగోవిందురెడ్డికి కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, జెడ్పీ సీఈఓ ఓబుళమ్మలు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

ఉదయం 10 గంటలకే నామినేషన్ దాఖలు

రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి.. గతంలో ఒంటిమిట్ట జెడ్పీటీసీగా ఉంటూ జెడ్పీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. గత సార్వత్రిక ఎన్నికల్లో ఆయన రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గ స్థానానికి పోటీ చేసి, ఎమ్మెల్యేగా గెలుపొందారు. దీంతో ఆయన ఒంటిమిట్ట జెడ్పీటీసీ, జిల్లా పరిషత్ చైర్మన్ స్థానాలకు రాజీనామా చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో కొత్త జెడ్పీ చైర్మన్‌ను ఎన్నుకునేందుకు.. ఎన్నికలు నిర్వహించారు. దీంతో జెడ్పీ చైర్మన్ అభ్యర్థిగా ముత్యాల రామగోవిందురెడ్డి.. జెడ్పీ సీఈఓ చాంబర్‌లో ఉదయం 10 గంటలకు నామినేషన్ దాఖలు చేశారు. కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పోచంరెడ్డి రవీంద్రనాథరెడ్డి, ఎమ్మెల్యేలు డాక్టర్ సుధా, అమర్‌నాథరెడ్డి, ఎమ్మెల్సీలు రమేష్ యాదవ్, ఎంవీ రామచంద్రారెడ్డి, డీసీ గోవిందురెడ్డి తదితరులతో కలిసి వెళ్లి.. సీఈఓ ఓబుళమ్మకు నామినేషన్ పత్రం అందజేశారు. ఆయనను పోరుమామిళ్ల జెడ్పీటీసీ చెన్నయ్య, వేముల జెడ్పీటీసీ బయపురెడ్డిలు చైర్మన్ అభ్యర్థిగా ప్రతిపాదించారు. అనంతరం ఏకైక నామినేషన్ దాఖలు కావడం, ఆపై కలెక్టర్ 'ఇంకా ఎవరైనా, మరే ఇతర సభ్యుడైనా చైర్మన్ అభ్యర్థిగా ప్రతిపాదిస్తారా' అని కోరినా.. హాజరైన జెడ్పీటీసీల్లో ఎలాంటి స్పందన రాలేదు. వెరసి ఏకగ్రీవంగా ముత్యాల రామగోవిందురెడ్డిని జెడ్పీ చైర్మన్‌గా ఎన్నికైనట్లు ప్రకటించారు.

టీడీపీ మద్దతుదారులు గైర్హాజరు

జిల్లాలో 50 జెడ్పీటీసీ స్థానాలు ఉండగా.. పులివెందుల, ఒంటిమిట్ట స్థానాలు ఖాళీ ఏర్పడ్డాయి. ప్రస్తుతం జిల్లా పరిషత్‌లో 48 మంది జెడ్పీటీసీ సభ్యులు ఉన్నారు. వారిలో గోపవరం మండల జెడ్పీటీసీ జయరామిరెడ్డి మాత్రమే తెలుగుదేశం పార్టీ నుంచి ఎన్నికయ్యారు. మిగతా జెడ్పీటీసీలు అందరూ వైఎస్సార్‌సీపీ సభ్యులే. కాగా వారిలో ఓబులవారిపల్లె, చిన్నమండెం, వీరపునాయునిపల్లె, ముద్దనూరు, జమ్మలమడుగు జెడ్పీటీసీలు పార్టీ ఫిరాయించారు. టీడీపీ జెడ్పీటీసీ ఒకరు, వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి వెళ్లిన ఐదుగురు జెడ్పీటీసీలు.. జెడ్పీ చైర్మన్ ఎన్నికల్లో పాల్గొనలేదు. వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి మాతృమూర్తి మృతి కారణంగా.. ఈ ఎన్నికల్లో పాల్గొన లేకపోయారు. తక్కిన 41 మంది సభ్యులు సమావేశానికి హాజరై ఏకగ్రీవంగా ముత్యాల రామగోవిందురెడ్డిని జెడ్పీ చైర్మన్‌గా ఎన్నుకోవడం విశేషం.

అభినందనల వెల్లువ

జెడ్పీ చైర్మన్‌గా ఆసీనులైన రామగోవిందురెడ్డికి పెద్ద ఎత్తున అభినందనలు లభించాయి. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యేలు డాక్టర్ సుధా, ఆకేపాటి అమర్‌నాథరెడ్డి ఎమ్మెల్సీలు డీసీ గోవిందురెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డి, రమేష్‌యాదవ్, కడప మేయర్ సురేష్‌బాబు, మాజీ ఎమ్మెల్యేలు పోచంరెడ్డి రవీంద్రనాథరెడ్డి, ఎస్‌బీ అంజద్‌బాషా, ఎస్.రఘురామిరెడ్డిలు ప్రత్యేక అభినందనలు తెలిపారు. పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాలతో సత్కరించారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున అభినందనల కార్యక్రమంలో పాల్గొన్నారు.



జెడ్పీ చైర్మన్ రామగోవిందురెడ్డిని అభినందిస్తున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, పార్టీ నేతలు



జెడ్పీ చైర్మన్‌ను అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

పని చేయని టీడీపీ కుట్రలు

- కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, కడప: వైఎస్సార్ జిల్లా జెడ్పీ చైర్మన్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ కుట్రలు, కుయుక్తులు పని చేయలేదని కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. గురువారం జెడ్పీ చైర్మన్‌గా ఎన్నికైన ఎం.రామగోవిందురెడ్డిని అభినందించిన తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. 'జిల్లా పరిషత్‌లో 47 మంది సభ్యులు వైఎస్సార్‌సీపీ వారే. ఒకే ఒక్కరు మాత్రమే టీడీపీ సభ్యుడు. బలం లేని కారణంగా జెడ్పీ చైర్మన్ ఎన్నికల్లో పోటీలో లేమంటూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసులరెడ్డి ప్రకటించారు. విలువలతో కూడిన రాజకీయాలు చేస్తున్నామంటూ వ్యాఖ్యానించారు. ఆ మరుసటి రోజే అదే టీడీపీ జెడ్పీటీసీ జయరామిరెడ్డి ద్వారా.. జెడ్పీ చైర్మన్ ఎన్నికలు నిలుపుదల చేయాలంటూ స్టేటస్‌కో కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. తెలుగుదేశం పార్టీ నేతల మాటలకు, చేతలకు ఏమాత్రం పొంతన లేదన్నది సుస్పష్టం' అని ఎంపీ అన్నారు.

ప్రభుత్వాన్ని అడ్డుపెట్టుకొని అనైతిక చర్యలు

కడప మేయర్ సురేష్‌బాబును పదవీచ్యుతున్ని చేయాలని ఎమ్మెల్యే మాధవిరెడ్డి దంపతులు విశ్వయత్నం చేస్తున్నారని, ప్రభుత్వాన్ని అడ్డుపెట్టుకొని అనైతిక చర్యలకు పాల్పడుతున్నారని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆరోపించారు. 'కార్పొరేషన్‌లో అధికారికంగా టీడీపీకి సంఖ్యాబలం లేదు. ఒకే ఒక్క కార్పొరేటర్ మాత్రమే ఆ పార్టీ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో మేయర్‌కు షోకాజ్ నోటీసు అందకమునుపే.. వీరిద్దరు చేతిలో పట్టుకొని షోకాజ్ నోటీసులు చూపుతున్నారు. అంటే ప్రభుత్వం నుంచి వీరే షోకాజ్ ఇప్పించారని, ఇట్టే అర్థం కాలేదా? ప్రజలు ఆ మాత్రం అర్థం చేసుకోలేరా? ఇంత ఛీప్‌గా కడప ఎమ్మెల్యే వ్యవహరిస్తున్నారని నగర ప్రజలు మథనపడుతున్నారు. టీడీపీ ఎమ్మెల్యేలకు శాశ్వతంగా రాజకీయ సమాధి కట్టేందుకు ప్రజలు సమయం కోసం వేచి ఉన్నారు' అని ఆయన వివరించారు.

న్యూస్‌రీల్

ధ్రువపత్రాలను పరిశీలించాకే ప్రవేశాలు

రాజంపేట: మండలంలోని ఎస్ఆర్ పల్లెలోని జవహర్ నవోదయ విద్యాలయ పాఠశాలకు ఎంపికైన వారి తాత్కాలిక జాబితాను విడుదల చేసినట్టు పాఠశాల ప్రిన్సిపల్ గీత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత జాబితా హెచ్‌టీటీపీఎస్//డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూఎన్‌వోవీవోడీఏవైఏ.జీఓవీ.ఇన్/ఎన్‌వీఎస్/ఎన్‌వీఎస్-ఎస్‌సీహెచ్‌వోవోఎల్/కేఏడీఏపీఏ/ఈఎన్/హెచ్‌వోఎంఈ/ అందుబాటులో ఉందన్నారు. అభ్యర్థులు అందజేసిన ధ్రువపత్రాలను పరిశీలించిన తరువాత అడ్మిషన్ కల్పిస్తామన్నారు. అంతవరకు బదిలీ సర్టిఫికెట్ (ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్) తీసుకోరాదని తెలిపారు.

నూతన నియామకం



దయానంద

రాజంపేట టౌన్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా రాజంపేట పట్టణానికి చెందిన పలుకూరి దయానందను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈవిషయాన్ని దయానంద గురువారం ఇక్కడ విలేకరులకు తెలిపారు. పెన్షనర్ల సమస్యలపై వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో రాజీలేని పోరాటం సాగిస్తామని తెలిపారు. ఈసందర్భంగా దయానంద మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న పీడీ రమాదేవి

వీరబల్లి: మండలంలో పనిచేస్తున్న అంగన్ వాడీ కార్యకర్తలకు గురువారం పెద్దివీడు రెడ్డివారిపల్లి హైస్కూల్‌లో శిక్షణా తరగతులు నిర్వహించారు. మూడురోజుల శిక్షణలో భాగంగా మొదటిరోజు ఐసీడీఎస్ పీడీ రమాదేవి మాట్లాడుతూ శిక్షణా తరగతులలో నేర్చుకున్న అంశాలను అంగన్ వాడీల్లో అమలు చేయాలని, కేంద్రాలను బలోపేతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. పిల్లలకు పోషక పదార్థాలను సక్రమంగా అందించాలన్నారు. గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించాలని, కోరారు. ఈ కార్యక్రమంలో సుండుపల్లి సీడీపీఓ సుగుణమ్మ, అంగన్ వాడీ సూపర్ వైజర్లు సరస్వతమ్మ, లలితమ్మ, సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.



మలిసంధ్యలోనూ.. ప్రజా సేవలో..

ఆమె పేరు షేక్ భానుబీ. వయసు 95. కానీ ఇప్పటికీ ప్రజా సేవ కోసం పరితపిస్తోంది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అంటే ఎనలేని అభిమానం. ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్థాపించిన వైఎస్సార్‌సీపీలో తొలిసారిగా 2015లో గాలివీడు -1 ఎంపీటీసీగా పోటీ చేసి ఓడిపోయినా కుంగిపోకుండా.. 2020లో జెడ్పీ ఎన్నికల్లో గాలివీడు జెడ్పీటీసీగా మహిళ రిజర్వు స్థానంలో పోటీ చేసి గెలుపొందారు. అప్పటికి ఆమె వయసు 90. ప్రస్తుతం 95 ఏళ్లు. అయినా కూడా చాలా హుషారుగా ఈ రోజు జెడ్పీ చైర్మన్ ఎన్నికల్లో పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి ఓటు వేసి మద్దతుగా ఉండేందుకు ఇక్కడికి వచ్చారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుటుంబంపై అభిమానంతో ఓటు వేసేందుకు వచ్చానని తెలిపారు.

– సాక్షి, సీనియర్ ఫొటోగ్రాఫర్, కడప

పట్టు నిలుపుకున్న వైఎస్సార్‌సీపీ

- రాయచోటి, ఒంటిమిట్టలలో వైస్ ఎంపీపీ, పీలేరులో కో ఆప్షన్ సభ్యుల ఉప ఎన్నికలు
- రెండుచోట్ల వైఎస్సార్ సీపీ అభ్యర్థులు ఏకగ్రీవం
- ఒంటిమిట్టలో ప్రజాస్వామ్యం అపహాస్యం



ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న రాయిచోటి రూరల్ వైస్ ఎంపీపీ- 2 గా ఎంపికైన నాగసుబ్బమ్మ



నియామకపత్రం అందుకుంటున్న పీలేరు మండల కోఆప్షన్ సభ్యుడిగా ఎన్నికైన సయ్యద్‌బాషా

రాయచోటి/ఒంటిమిట్ట/పీలేరు: అన్నమయ్య జిల్లా వైఎస్సార్ సీపీకి అడ్డా అని మరోసారి రుజువైంది. గురువారం జరిగిన ఉప ఎన్నికల్లో పట్టును నిలుపుకొని తన బలాన్ని నిరూపించుకుంది. మండల పరిషత్ ఉపాధ్యక్షుల పదవులు, కో ఆప్షన్ పదవుల ఎన్నికల్లో అధికార పార్టీ బలాన్ని అడ్డుపెట్టుకుని ఆ స్థానాలను దక్కించుకోవడం, లేదా వాటి ఎన్నికలను నిలుపుదల చేయాలన్న కూటమి సభ్యుల కుట్ర ఫలించలేదు. రాయచోటి రూరల్ మండల్ పరిషత్ ఉపాధ్యక్ష-2, పీలేరు మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుని ఉప ఎన్నికలో తిరిగి వైఎస్సార్‌సీపీ చెందిన మద్దతుదారులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాయచోటి రూరల్ మండల్ పరిషత్ ఉపాధ్యక్ష-2 స్థానానికి సిబ్యాల ఎంపీటీసీ నాగ సుబ్బమ్మను (వైఎస్సార్‌సీపీ) ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పీలేరు మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యునిగా సయ్యద్ బాషా (వైఎస్సార్‌సీపీ) ఎన్నికయ్యారు.

ప్రజాస్వామ్యం అపహాస్యం

ఒంటిమిట్ట మండల పరిషత్ ఉపాధ్యక్ష-2 ఎన్నిక విషయంలో ప్రజాస్వామ్యం అపహాస్యమైంది. గురువారం ఉపాధ్యక్ష ఎన్నిక సమయంలో వైఎస్సార్‌సీపీ చెందిన ఎంపీటీసీల కోరం ఉన్నప్పటికీ అభ్యర్థి ఎంపిక విషయంలో మనస్పర్థలు పొడచూపాయి. ఇదే అదునుగా భావించిన టీడీపీ నాయకుడు మేడా విజయ శేఖర్ రెడ్డి తన అధికార, ఆర్థిక బలాన్ని అడ్డుపెట్టి, ఎన్నికల అధికారులను భయపెట్టి వైఎస్సార్‌సీపీకి చెందిన ఎంపీటీసీ నల్గొండ లక్ష్మీదేవిని రెబల్ అభ్యర్థిగా పోటీ చేయించి ఎన్నికను నిర్వహించుకున్నారన్న విమర్శలు ఉన్నాయి. రెబల్ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచిన అభ్యర్థి కూడా గత ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఎంపీటీసీగా గెలిచిన విషయం తెలిసిందే. స్థానిక టీడీపీ నాయకులు, ఎంపీటీసీలను కాదని వైఎస్సార్‌సీపీ వారిని తమ పార్టీ గెలుపు అభ్యర్థిగా చెప్పుకోవడం దారుణమని ఆ పార్టీ నాయకులే విమర్శించడం గమనార్హం. పార్టీ కోసం పనిచేసి, ఆర్థికంగా చితికిపోయిన సభ్యులను ఏమాత్రం పట్టించుకోకుండా అధికారులను భయపెట్టి ఉపాధ్యక్ష ఎంపికను టీడీపీ ఖాతాలో జమ చేసుకోవడం సిగ్గుచేటుగా ఉందని ఆ పార్టీ నాయకులు మీడియా ముందు ఆవేదన వెలిబుచ్చారు. ఏది ఏమైనా అన్నమయ్య జిల్లాలో గురువారం జరిగిన ఉప ఎన్నికలో వైఎస్సార్‌సీపీ పట్టును నిలుపుకుందనడంలో ఎలాంటి సందేహం లేదు.



ఒంటిమిట్ట: ధ్రువీకరణ పత్రాన్ని అందుకుంటున్న వైస్ ఎంపీపీ-1గా ఎన్నికైన నల్గొండ లక్ష్మీదేవి



రాయచోటిలోని రాణా వద్ద విద్యుత్ దీపాలంకరణలో జామియా మసీద్

భక్తిశ్రద్ధలతో షబ్బే ఖద్ర్ ప్రార్థనలు

రాయచోటి: జిల్లాలోని మసీదులన్నీ విద్యుద్దీప కాంతులతో ధగధగలాడుతున్నాయి. ఆ ప్రాంగణాలన్నీ ఆధ్యాత్మిక చింతనతో వెలుగుతున్నాయి. పవిత్ర ఖురాన్‌లోని దైవ సందేశం గురించి వివరిస్తున్న గురువుల బోధనలతో భక్తిభావనను నింపుతున్నాయి. షబ్బే ఖద్ర్ (బడీరాత్) ప్రత్యేక ప్రార్థనలతో ఆయా ప్రాంతాలు కొత్త కళను సంతరించుకున్నాయి. రంజాన్ మాసంలో అతి ముఖ్యమైన చివరిఘట్టం గురువారం షబ్బే ఖద్ర్‌తో ప్రారంభమైంది. రాత్రంతా మసీదు ప్రాంగణాల్లో భక్తులు పూర్తి ఆధ్యాత్మిక చింతనతో గడిపారు. దాదాపు తెల్లవారు జామున సెహరి వరకు ఈ బోధనలు కొనసాగాయి. రాత్రంతా కఠోరదీక్షతో ప్రార్థనలు చేసేన వారికి 83 సంవత్సరాల పాటు ప్రార్థనలు చేసిన ఫలం దక్కుతుందనే నమ్మకం ఉంది. ఈ ప్రార్థనల వల్ల సర్వపాపాలు తొలగిపోతాయని భావిస్తారు.

ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు



మ్యాప్‌ను పరిశీలిస్తున్న టీటీడీ అదనపు ఈఓ వెంకయ్య చౌదరి తదితరులు

టీటీడీ అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్య చౌదరి

ఒంటిమిట్ట: ఒంటిమిట్టలో శ్రీ కోదండరామ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయని టీటీడీ అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్య చౌదరి పేర్కొన్నారు. ఒంటిమిట్టలో జరుగుతున్న పనులను టీటీడీ జేఈఓ వి వీరబ్రహ్మంతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏప్రిల్ 5వ తేదీ నుండి 15 వరకు జరగనున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు 5న అంకురార్పణ జరగనుందని తెలిపారు.11న శ్రీ సీతారాముల కల్యాణోత్సవం జరుగుతుందని తెలిపారు. భక్తుల రద్దీ, గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకొని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. టీటీడీలోని వివిధ విభాగాల అధికారులు ప్రణాళికాబద్ధంగా పనులు చేస్తున్నారని వివరించారు. ఏప్రిల్ 11వ తేదిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్ర ప్రభుత్వం తరపున శ్రీ సీతారాముల వారికి పట్టు వస్త్రాలను సమర్పిస్తారన్నారు. కల్యాణ వేదిక వద్ద, ఆలయ పరిసర ప్రాంతాల్లో ఆకట్టుకునేలా పుష్పాలంకరణ చేయనున్నట్లు చెప్పారు. అన్నప్రసాదాల పంపిణీ, భక్తులకు స్వామివారి తలంబ్రాలు, శ్రీవారి లడ్డూ ప్రసాదం, తాగునీరు, మజ్జిగ అందించేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అంతకు ముందు అదనపు ఈఓకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అభివృద్ధి పనుల గురించి అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో సీఈ సత్యనారాయణ, ఎస్ఈ (ఎలక్ట్రికల్) వెంకటేశ్వర్లు, ట్రాన్స్‌పోర్ట్ జీఎం శేషారెడ్డి, వీజీఓలు శ్రీరామ్ కుమార్, సదాలక్ష్మీ, అన్నప్రసాద విభాగం ప్రత్యేకాధికారి జీవీఎల్ఎస్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుర్తుతెలియని వాహనం ఢీకొని వికలాంగుడు మృతి

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని రాఘవ రాజపురం హరిజనవాడకు చెందిన వికలాంగుడు జోలా సతీష్(38) గురువారం గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతి చెందాడు. బుధవారం అర్ధరాత్రి దాటాక గంగరాజపురం డాబా వద్ద వెళ్తుండగా ఆయనను వాహనం ఢీకొని ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు

మదనపల్లె సిటీ : ప్రయాణికులకు మెరుగైన సేవలందించాలని జిల్లా ప్రజా రవాణాధికారి రాము పేర్కొన్నారు. స్థానిక ఆర్టీసీ–2 డిపో బస్టాండు, స్టాల్స్, గ్యారేజీలోని బస్సులను గురువారం ఆయన తనిఖీ చేశారు. రాము మాట్లాడుతూ సమయపాలన పాటించి బస్సు నడపాలని, ఆర్టీసీ ఆదాయం పెంచేందుకు కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. అనంతరం షెడ్యూల్ 3, షెడ్యూల్ 4 మెయింటెన్స్ అయిన బస్సులను తీసుకెళ్లి పరీక్షించారు. ఈ కార్యక్రమంలో డీఎం అమరనాథ్, సీఐ గీత, సిబ్బంది పాల్గొన్నారు.

హత్య కేసులో వ్యక్తికి జీవిత ఖైదు



జీవిత ఖైదు శిక్షపడిన బుర్రకట్ల ఈశ్వరయ్యతో పోలీసులు

పెనగలూరు : మండలంలోని ఓబిలి గ్రామానికి చెందిన బుర్రకట్ల ఈశ్వరయ్యకు జీవిత ఖైదు, రూ.2 వేల జరిమానా విధించినట్లు ఎస్ఐ రవిప్రకాష్ రెడ్డి తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. 2020 జనవరి, 28న అన్నదమ్ములు బుర్రకట్ల మహేశ్వరయ్య, బుర్రకట్ల ఈశ్వరయ్యల మధ్య చెత్త తీయు విషయమై మాటా మాటా పెరిగి ఘర్షణ జరిగింది. బుర్రకట్ల మహేశ్వరయ్య తలపై బుర్రకట్ల ఈశ్వరయ్య రాడ్డుతో బలంగా కొట్టాడు. దీంతో రక్తస్రావం కావడంతో మహేశ్వరయ్య మృతి చెందాడు. అప్పటి ఎస్ఐ చెన్న కేశవ రాజంపేట మండలం, మునక్కాయలపల్లి గ్రామానికి చెందిన కడియాల శ్రీనివాసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. సాక్షులను విచారించి శుక్రవారం రాజంపేట అడిషనల్ జడ్జీ ప్రవీణ్ కుమార్ ముద్దాయికి జీవిత ఖైదు, రూ. 2 వేలు జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలియజేశారు.

కూటమి నేతల భూ కబ్జా

వడ్డించేవాడు మనవాడు అయినపుడు కడబంతిలో ఉన్నా కడుపు నిండా భోజనం లభిస్తుందన్న పెద్దల సూక్తిని మరిపించేలా అనుకూలమైన అధికారులు మా గుప్పెట ఉన్నంత సేపు తాము అనుకున్న ప్రభుత్వ భూముల ఆక్రమణకు ఇబ్బంది ఉండదనే కూటమి నేతల మాటలు అద్దంలో కనిపించే బొమ్మలా సరిపోతుంది.

- రూ. కోట్ల విలువ చేసే మున్సిపల్ స్థలం ఆక్రమణ
- సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న టీడీపీ నేతల భాగోతం
- పట్టించుకోని మున్సిపల్, రెవెన్యూ శాఖలు



ప్రభుత్వ భూమిని ట్రాక్టర్ల సాయంతో చదును చేస్తున్న దృశ్యం

రాయచోటి : ఖాళీగా కనిపించిన ప్రభుత్వ స్థలాలపై అధికార పార్టీ నాయకుల కన్నుబడింది. అనుకున్నదే తడువుగా వాటికి కావాల్సిన రికార్డులను సృష్టించి ప్రభుత్వ భూముల ఆక్రమణలో మేటిగా నిలుస్తున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. అన్నమయ్య జిల్లా రాయచోటి పరిసర ప్రాంతాలలోనూ ప్రభుత్వ భూముల ఆక్రమణకు కూటమి నాయకుల ప్రయత్నం మొదలైనందనే ఆరోపణలు నిజమని తేలుతున్నాయి. కొందరు అధికారులను గుప్పెట్లో పెట్టుకుని కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూములను యథేచ్ఛగా ఆక్రమిస్తున్నట్లు వివరాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.

రాయచోటి మున్సిపాల్టీ ఆధీనంలో ఉన్న భూమిని స్థానికంగా ఉన్న ద్వితీయ శ్రేణి నాయకుడు చాకచక్యంగా తమ ఆధీనంలోకి తీసుకుని చదును చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రూరల్ మండలం శిబ్యాల గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 649/1సిలోని 5 ఎకరాల స్థలాన్ని టీడీపీ నాయకుడు ఆక్రమించిన సంఘటన సమీప ప్రాంతాల ప్రజలను కలవరపెడుతోంది. వెంకటయ్య కుమారుడు వెంకటనారీకి 1998లో ప్రభుత్వం అసైన్‌మెంట్ భూమి ఇచ్చింది. 2005లో అదే భూమిని పాపిరెడ్డి రమణమ్మ పేరిట రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్‌లో చేర్చారు. మరీ ఈ భూమిని వెంకటనారీ రమణమ్మకు అమ్మేశారా? లేదా? అన్న విషయాన్ని పక్కన పెడితే అసైన్‌మెంట్ ల్యాండ్ అమ్మడం, కొనడం నేరమైనప్పటికీ 2011లో ఆ భూమితో పాటు సమీపంలోని భూములన్నింటినీ కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వం కొనుగోలు చేసి పేదలకు ఇచ్చేందుకు సిద్ధమైంది. ప్రభుత్వం నుంచి రైతులకు పరిహారం కూడా చెల్లించింది. వెను వెంటనే సమైక్యాంధ్ర ఉద్యమం రావడం.. ప్రభుత్వ కార్యక్రమాలు వాయిదా పడటం.. రాష్ట్రం విడిపోవడం జరిగింది. ఆ తర్వాత తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా ప్రభుత్వం పేదలకు ఇళ్లు నిర్మించాలని సంకల్పించింది. ఈ క్రమంలోనే టిడ్కో సంస్థకు అపార్ట్‌మెంట్ నిర్మాణంలో భాగంగా 649 సర్వే నెంబర్‌లోని రెవెన్యూ భూమిని రాయచోటి మున్సిపల్ బోర్డుకు బదలాయించారు. టిడ్కో నిర్మాణ ప్రాంతానికి పక్కనే ఖాళీగా ఉన్న భూమిని టీడీపీ నాయకులు ఆక్రమించేందుకు సిద్ధమయ్యారు.

ఆక్రమణకు సిద్ధం

కోట్ల రూపాయలు విలువ చేసే భూమి మున్సిపల్ కమిషనర్ పేరిట టిడ్కో సంస్థ ఆధీనంలో ఉంది. ఎలాగైనా దానిని వశం చేసుకోవాలని భావించిన ఆ నాయకుడు 2005 ఆన్‌లైన్లో ఉన్న పాపిరెడ్డి రమణమ్మ అడంగల్‌ను సేకరించి భూమిని సర్వే చేయడానికి దరఖాస్తు చేశారు. కొంత మంది రెవెన్యూ అధికారుల సలహా మేరకు అధికారులు సర్వే చేయడం లేదనే కారణం చూపి హైకోర్టు నుంచి ఉత్తర్వులు పొందారు. తమకు అనుకూలమైన అధికారిని నియమించుకుని మున్సిపల్ బోర్డు పేరు మీదున్న విషయాన్ని కోర్టుకు చూపకుండా ఉత్తర్వులు తెచ్చారు. ఆగమేఘాలపై సర్వే చేయించుకుని కోర్టు ఉత్తర్వులతో ఆన్‌లైన్లో సైతం పాపిరెడ్డి రమణమ్మ పేరును తిరిగి నమోదు చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సర్వే పూర్తి చేయడంతోపాటు ఆక్రమించిన భూమి చుట్టూ కంచె వేసి పనులు పూర్తి చేసి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పాపిరెడ్డి రమణమ్మ దగ్గర కొనుగోలు చేసినట్లు రిజిస్ట్రార్ కూడా చేయించుకున్నట్లు తెలియవచ్చింది.

తహసీల్దార్ ఏమంటున్నారంటే..

649/1 సర్వే నెంబర్‌లో 5 ఎకరాల పైబడి భూమి ఉంది. ఈ భూమిలో టిడ్కో ఇళ్ల నిర్మాణానికి కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మేరకు ఇళ్ల నిర్మాణం కూడా జరిగింది. సమీపంలోని భూమిని కొంతమంది ఆక్రమించి కంచె వేసినట్లు తమ దృష్టికి వచ్చింది. మున్సిపల్ కమిషనర్ గురువారం భూ ఆక్రమణ వియంపై ఫిర్యాదు చేశారు. పాపిరెడ్డి రమణమ్మకు సంబంధించిన భూమి రికార్డులను రెవెన్యూ కార్యాలయానికి తీసుకురావాలని నోటీస్ ఇవ్వడం జరిగింది. రికార్డులన్నింటినీ పరిశీలించిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని రాయచోటి తహసీల్దార్ నరసింహకుమార్ తెలియజేశారు.

టీడీపీ నాయకుల పరస్పర ఫిర్యాదులు

నిమ్మనపల్లె : పనులలో అవినీతిని ప్రశ్నిస్తే దాడి చేసి దౌర్జన్యం చేశాడని, తనకు ప్రాణహాని ఉందని ఒకరిపై ఒకరు టీడీపీ నాయకులు పరస్పర ఫిర్యాదులు చేసుకున్న సంఘటన నిమ్మన పల్లెలో జరిగింది. ఘటనపై పోలీసులు గోప్యత పాటించడంతో విషయం కాస్త ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని సామకోటవారిపల్లె పంచాయతీ కోట గ్రామానికి చెందిన టీడీపీ మండల అధ్యక్షుడు, పుర్ర వెంకటరమణ, సామకోటవారిపల్లెకు చెందిన టీడీపీ నాయకులు మహేష్రెడ్డి, నిమ్మనపల్లె పోలీస్ స్టేషన్లో ఒకరినొకరు ఫిర్యాదు చేసుకున్నారు. బుధవారం ఉదయం నిమ్మనపల్లె బస్టాండ్లో అధ్యక్షుడు పుర్ర వెంకట రమణ ఉండగా, అదే సమయంలో అక్కడికి మహేష్ రెడ్డి వచ్చాడు. నేను చేస్తున్న పనులపై ఎందుకు అనవసరంగా, తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నావని వెంకటరమణ ప్రశ్నించాడు. దీంతో ఇరువురి మధ్య వాగ్వివాదం మొదలై ఒకరినొకరు బాహాబాహీకి దిగారు. స్థానికులు వారికి సర్ది చెప్పి పంపించేశారు.

అయితే ఈ విషయమై ఇద్దరు ఒకరిపై ఒకరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులలు ఫిర్యాదులపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా మీనమేషాలు లెక్కిస్తున్నారు. అమ్మకు ప్రాణహాని ఉందని ఫిర్యాదులలో తెలిపినా పోలీసు అధికారులు చర్యలు చేపట్టలేదు. పూర్ర వెంకటరమణ , మహేష్ రెడ్డి రెండు వర్గాలుగా విడిపోయి, ఒకరిపై ఒకరు ఎమ్మెల్యేకి ఫిర్యాదులు చేసుకుంటూ, మండలంలో ఆధిపత్యానికై ప్రయత్నిస్తున్నారు. దీంతో నాయకుల దిగజారుడు ప్రవర్తన పై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులకు మధ్యంతర భృతి చెల్లించాలి



ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

రాయచోటి టౌన్ : ఉద్యోగ, ఉపాధ్యాయులకు మధ్యంతర భృతి, కరువు భత్యం చెల్లించాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు డిమాండ్ చేశారు. పులివెందులలోని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి కార్యాలయంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై గురువారం ఆయన చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12వ పీఆర్సీ చెల్లించాలని, అది అమలయ్యేలోపు 29 శాతం ఐఆర్ ప్రకటించాలని కోరారు. మిగిలిపోయిన జీపీఎస్ ఏపీజీఎల్ఐ, సరెండర్ లీవ్ బకాయిలు, పేరుకపోయిన పెండింగ్ బిల్లుల చెల్లింపునకు రోడ్ మ్యాప్ వేయాలని కోరారు. సెప్టెంబర్ 2004కు ముందు నియమితులైన ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరారు. విశ్రాంత ఉపాధ్యాయులకు గ్రాట్యుటీ, పెన్షనరీ బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. గురుకులం, పబ్లిక్ సెక్టార్, మోడల్ స్కూల్ ఉద్యోగులు, ఎంటీసీలకు పదవీవిరమణ వయస్సు 62కు పెంచాలని కోరారు. అనంతరం ఎమ్మెల్సీకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డి రమేష్‌బాబు, సురేష్ కుమార్, అబ్దుల్ గఫార్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల ఆవేదన ప్రభుత్వానికి పట్టదా!

మాధవరం–1, వెంకటేశ్వరాపురం గ్రామాల్లో పరిశుభ్రతపై స్పెషల్ డ్రైవ్



వెంకటేశ్వరపురంలో పారిశుద్ధ్య పనులు చేపట్టిన గ్రామస్థులు

సిద్దవటం : పారిశుద్ధ్య సామగ్రి ఇవ్వకపోతే పనులు ఎలా చేయాలని పారిశుద్ధ్య కార్మికులు ప్రశ్నించారు. మండలంలోని మాధవరం–1, వెంకటేశ్వరాపురం గ్రామాల్లో పరిశుభ్రతపై గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వారు మాట్లాడుతూ పనిభారం పెరిగినా తగిన వేతనం ఇవ్వడం లేదని కార్మికులు అధికారులకు విన్నవించారు. మాధవరం–1 సచివాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో తమకు తాగునీరు సరఫరా చేయడంలేదని వెంకటేశ్వరపురం ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. నీటి సమస్య పరిష్కారం చేయాలని పలుమార్లు తెలియజేసినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. వేసవిలో సమస్య పరిష్కరించనపుడు సమావేశాలు ఎందుకంటూ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీఓ ఫణి రాజకుమారి మాట్లాడుతూ ఐదు రోజుల్లో నీటి సమస్య పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గురుప్రసాద్, ఏపీఓ నరసింహులు, లక్ష్మినరసయ్య, వీరభద్రుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కలెక్టర్ గారూ.. స్పందించండి

ఇళ్లకు డోర్ నంబర్లు లేక యజమానుల ఇబ్బందులు

పెద్దతిప్పసముద్రం : కొత్తగా కట్టిన ఇళ్లకు డోర్ నంబర్లు లేకపోవడంతో జనం ఇబ్బంది పడుతున్నారు. నిత్యం సచివాలయాలు, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా పది నుంచి 20 శాతం వరకు కొత్తగా కట్టిన ఇళ్లకు డోర్ నెంబర్లు లేవు. విద్యుత్ కనెక్షన్ కోసం ఇచ్చిన ఎన్‌వోసీ రోజు ఇచ్చిన అధికారులు అందులోనే డోర్ నెంబర్ ఇచ్చి ఉంటే తమకు బాధలన్నీ తప్పేవని ఇళ్లు కట్టుకున్నవారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఊళ్ళో స్వంత స్థలాలు లేని చాలామంది ఊరి బయట, రోడ్డు పక్కన స్థలాలు కొనుగోలు చేసి గృహాలు నిర్మించుకుంటున్నారు. సదరు ఇల్లు కట్టుకున్న వ్యక్తికి ప్రభుత్వ బోరు నుంచి పైప్‌లైన్, ఇంటి నిర్మాణం పూర్తయ్యాక విద్యుత్ కనెక్షన్ మంజూరుకు కార్యదర్శులు చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలున్నాయి. తమ వద్ద వేలల్లో డబ్బు తీసుకుంటూ డోర్ నెంబర్లు ఇవ్వడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు అక్రమార్జనతో ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇంటికి కొత్తగా డోర్ నంబర్ ఉంటే ఆధార్, రేషన్ కార్డులో చిరునామా మార్పు చేసుకుని ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకునే వారమని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ స్పందించి తమకు డోర్‌నెంబర్లు వచ్చేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

విద్యుత్తు కాంట్రాక్ట్ పనులకు అడ్డుకట్ట



కాంట్రాక్టర్‌తో వాగ్వాదం చేస్తున్న గ్రామస్థులు

నందలూరు : మండల కేంద్రంలోని భారత గ్యాస్ కార్యాలయం నుంచి నీలిపల్లెకు వెళ్లే దారిలో చేపట్టిన విద్యుత్తు కాంట్రాక్ట్ పనులను నీలిపల్లి గ్రామస్తులు గురువారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ తమ గ్రామానికి సింగిల్ ఫేస్ విద్యుత్ లైన్ ఉండేదని, ప్రస్తుతం త్రీఫేస్ విద్యుత్ పనులను కాంట్రాక్టర్ మొదలు పెట్టారన్నారు. కొద్ది దూరం త్రీఫేస్ లైన్ లాగి మధ్యలో సింగిల్ ఫేస్ లాగడంతో పనులను తాము అడ్డుకున్నట్లు తెలిపారు. గ్రామానికి వెళ్లే దారిలో 50 ఏళ్లకు పైగా వయస్సు గల వృక్షాలను ఇష్టానుసారంగా నరికి వేయడం దారుణమన్నారు. చెట్లను నరికేందుకు రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ అధికారుల అనుమతి తీసుకోలేదన్నారు. అనంతరం త్రీఫేస్ లైన్ లాగేందుకు కాంట్రాక్టర్ ఒప్పుకోవడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడు మృతి



బావిలో భరత్ మృతదేహాన్ని వెలికి తీస్తున్న సిబ్బంది

తంబళ్లపల్లె : అనుమానాస్పదస్థితిలో ఓ యువకుడు బావిలో పడి మృతి చెందిన సంఘటన గురువారం మండలంలో జరిగింది. కుటుంబీకుల కథనం మేరకు.. తంబళ్లపల్లె ఈస్టుపేటకు చెందిన జి.వెంకటరమణ అలియాస్ జీవీ కుమారుడు భరత్(25) మదనపల్లెలోని ఓ ప్రైవేట్ బస్సులో క్లీనర్‌గా పనిచేస్తున్నారు. డ్యూటీ ముగించుకుని ఇంటికి వచ్చిన ఆయన స్నేహితులతో కలిసి బయటకు వెళ్లాడు. రాత్రి ఇంటికి రాకపోవడంతో స్నేహితులతో కలిసి వ్యవసాయబావి వద్ద మద్యం తాగినట్లు తెలిసి గాలించారు. బావి వద్దకు వెళ్లి చూడగా చెప్పు, సెల్‌ఫోన్ ఉండగా మరో చెప్పు బావిలో తేలియాడడం గమనించి ఎస్ఐ లోకేష్‌రెడ్డికి సమాచారం అందించారు. కొందరు యువకులను బావిలోకి దించినా ప్రయోజనం లేకపోయింది. సాయంత్రం శవం నీటిపై తేలియాడడంతో పోస్టుమార్టం కోసం మదనపల్లె ఆస్పత్రికి తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ తెలిపారు.

వేలంపాటలో రూ.53,96,700 ఆదాయం



వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

కలకడ : కలకడ మేజర్ పంచాయతీకి వేలం పాటల ద్వారా రూ.53,96,700 ఆదాయం సమకూరిందని మదనపల్లె డీఎల్‌పీఓ నాగరాజ తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో కలకడ సర్పంచ్ ప్యారీజాన్ అధ్యక్షతన గురువారం వేలంపాటలు నిర్వహించారు. డీఎల్‌పీవో మాట్లాడుతూ వారపుసంతను పులివెందులకు చెందిన శ్రీహరినాయుడు రూ.18,20,000కు, కలకడ దినసరి టమాట మార్కెట్‌ను కలకడకు చెందిన నసీబ్‌జాన్ రూ.31,50,000కు, బస్టాండును రూ.1,75,000కు కలకడకు చెందిన యంఎస్.వల్లి, కలకడ వ్యాపారస ముదాయంలోని రెండో నెంబర్‌ని కలకడకు చెందిన బబ్లూ రూ.1,24,800, మూడో నెంబర్ గదిని దేవళంపేటకు చెందిన మాసూంసాహెబ్ రూ.1,24,800కు, జంతువధశాలను కలకడకు చెందిన మునాఫ్‌సాబ్ రూ.2,100కు దక్కించుకున్నట్లు తెలిపారు. ఒకటో నెంబర్‌గది వేలంపాట వాయిదా పడిందన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ మహమ్మద్ రియాజ్‌వుద్దీన్, దేవేంద్ర, ఇనయతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక ధోరణులపై అవగాహన



సీఈవో డా.కృష్ణనాగరాజన్‌ను సన్మానిస్తున్న చొప్పా అభిషేక్‌రెడ్డి

రాజంపేట : పరిశ్రమలలో మారుతున్న సాంకేతిక ధోరణులపై విద్యార్థులకు స్పష్టమైన అవగాహన ఉండాలని అన్నమాచార్య యూనివర్సిటీ ప్రో–చాన్స్‌లర్ చొప్పా అభిషేక్‌రెడ్డి అన్నారు. ట్రెనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో ఏఐటీఎస్ ఆడిటోరియంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. చొప్పా అభిషేక్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఎప్పటికప్పుడు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించేందుకు ఏయూ సదస్సులు నిర్వహించడం జరుగుతోందన్నారు. సాఫ్ట్‌వేర్ సంస్థలకు చెందిన వారితో ప్రసంగాలు చేయిస్తున్నామన్నారు. కొత్ సాఫ్ట్‌వేర్ సంస్థ సీఈఓ డా.కృష్ణ నాగరాజన్ మాట్లాడుతూ తమ సంస్థ రూపొందించిన కోడెక్‌లను ప్రపంచ వ్యాప్తంగా టెలికాం సంస్థలు వినియోగిస్తున్నాయన్నారు. ఆర్కెటిక్ పుత్తూరు మోహన్‌రెడ్డి మాట్లాడుతూ తాజా సాంకేతిక అంశాలపై విద్యార్థులు పట్టు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో వీసీ డా.సాయిబాబారెడ్డి, ప్రిన్సిపల్ డా.ఎంవీ.నారాయణ, టీపీఓలు హేమకేశవులు, సత్యేంద్రకుమార్, రమేష్‌బాబు పాల్గొన్నారు. అనంతరం నిపుణులను ఏయూ ప్రో–చాన్స్‌లర్ చొప్పా అభిషేక్‌రెడ్డి ఘనంగా సన్మానించారు.

రాళ్లదాడి కేసులో నిందితుడు అరెస్టు



నిందితుడి అరెస్టు చూపుతున్న ఎస్ఐ, సిబ్బంది

మదనపల్లె : మండలంలోని చిప్పిలి గ్రామం వద్ద జరిగిన రాళ్ల దాడి కేసులో ఓ నిందితుడిని అరెస్టు చేసినట్లు తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. చిప్పిలి గ్రామానికి చెందిన షేక్ మహబూబ్‌బాషా కుమారుడు షేక్ మహమ్మద్ అలీ అలియాస్ లడ్డూ(28) గతంలో పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నారన్నారు. ఈ నెల 24న సాయంత్రం మండలంలోని జంగాలపల్లెకు చెందిన ఆదికేశవ, చరణ్, సుమంత్‌లు ద్విచక్ర వాహనంలో వస్తుండగా మద్యం మత్తులో ఉన్న మహమ్మద్ అలి వారిని ఆపి బైక్ ఇవ్వాలని నిలదీశాడన్నారు. వారు ఒప్పుకోకపోవడంతో వారిపై విచక్షణారహితంగా రాళ్లతో దాడి చేశాడన్నారు. ఆదికేశవ తీవ్రంగా గాయపడగా చరణ్, సుమంత్ స్వల్ప గాయాలతో జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. ఆదికేశవను మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితుడైన మహమ్మద్ అలీని అరెస్టు చేసి హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. కాగా నిందితుడు మహమ్మద్ అలీ ఇది వరకు పలు కేసుల్లో ముద్దాయిగా ఉంటూ నేరప్రవృత్తి కలిగి ఉన్నారన్నారు. 2020 డిసెంబరు,18న కర్నాటక రాష్ట్రం నుంచి ద్విచక్ర వాహనంలో మద్యం రవాణా చేస్తూ అరెస్టు అయ్యారని, 2021 ఫిబ్రవరి,11న చిప్పిలిలో గొడవపడి ఇద్దరు వ్యక్తులను తీవ్రంగా కొట్టడంతో కేసు నమోదు చేశామన్నారు. 2023 అక్టోబరు, 11న రాత్రి కర్నాటక రాష్ట్రానికి టమాటలతో వెళుతున్న లారీని అనుచరులతో అడ్డగించి వారిని కొట్టి వారి నుంచి నగదు దోచుకున్న కేసులోనూ అతడిని అరెస్టు చేశారన్నారు.

సారూ.. మీకు ఇది తగునా..



రాయచోటిలో టీడీపీ సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు గుర్తింపు కార్డులు అందజేస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి : ప్రభుత్వ కార్యక్రమాలు, జిల్లా అధికారిక కార్యక్రమాలను మీడియా ద్వారా ప్రజలకు తెలియపరచడం సమాచార పౌర సంబంధాల శాఖ బాధ్యత. అన్నమయ్య జిల్లాలో మాత్రం అధికార పార్టీ నాయకుల పార్టీ కార్యక్రమాలను కూడా ప్రభుత్వ కార్యక్రమాలుగా ప్రచారం చేయడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. గురువారం రాయచోటిలో టీడీపీ సభ్యత్వం తీసుకున్న పార్టీ నాయకులు, కార్యకర్తలకు మంత్రి చేతులమీదుగా పంపిణీ చేసిన గుర్తింపు కార్డుల సమాచారాన్ని కూడా సమాచార పౌర సంబంధాల శాఖ ప్రభుత్వ మీడియా గ్రూపులో చేర్చడం మీడియా వర్గంలో చర్చకు దారి తీసింది. గతంలో కూడా పార్టీ కార్యక్రమాలు, మంత్రి వ్యక్తిగత కార్యక్రమాలను గ్రూప్‌లలో పోస్ట్ చేస్తుండటం చర్చనీయాంశంగా మారింది. సారూ.. ఒక్కసారి ఆలోచించండి.. ఇలా చేయడం మీకు తగునా...!

గండి హుండీల ఆదాయం రూ.9.07లక్షలు

చక్రాయపేట : మండలంలోని మారెళ్లమడక గ్రామంలోని గండి వీరాంజనేయ స్వామి ఆలయంలో హుండీల లెక్కింపు ద్వారా రూ.9,07,554 ఆదాయం వచ్చిందని ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. గండి వీరాంజనేయస్వామి క్షేత్రంలో గురువారం హుండీ లెక్కింపు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ హుండీల ద్వారా రూ.9,07,554ల నగదు, 005.00గ్రాముల బంగారు, 320.00 గ్రాముల వెండి, అన్నప్రసాద వితరణ హుండీ ద్వారా రూ.14,407ల ఆదాయం వచ్చిందన్నారు. మధ్యాహ్నం బహిరంగ వేలం ద్వారా ఆలయంలో పాలు, పెరుగు, మజ్జిగ ప్యాకెట్ల సరఫరా వేంపల్లెకు చెందిన సుధీర్ దక్కించుకున్నారన్నారు. దేవస్థాన భూములు, షాపింగ్ కాంప్లెక్స్ గదుల లీజు హక్కులకు, ఖాళీ నెయ్యి డబ్బాలు, నిరూపయోగ వస్తువుల విక్రయాలు, కూరగాయల సరఫరా హక్కులకు ఎవరూ డిపాజిట్ కట్టి పాల్గొనకపోవడంతో వాయిదా పడిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కేసరి, రాజా రమేష్, దేవస్థాన చైర్మన్ కావలి కృష్ణ, బోర్డు సభ్యులు, ఏపీజీబీ సిబ్బంది, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


ఆటో ఢీకొని ఒకరికి గాయాలు

మదనపల్లె : ఆటో ఢీకొని ఒకరు తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం కురబలకోట మండలంలో జరిగింది. తెట్టు గ్రామానికి చెందిన చంద్ర కుమారుడు వెంకటరమణ (35) పైపుల కోసం ద్విచక్రవాహనంలో బొమ్మనబావికి వస్తున్నారు. ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొని తీవ్ర గాయాలవడంతో స్థానికులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

స్ప్రేయర్ పేలి మరొకరికి..

మదనపల్లె : పంటలకు మందులు కొట్టే స్ప్రేయర్ (పిచికారి యంత్రం) పేలి వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం ములకలచెరువు మండలంలో జరిగింది. మదనపల్లె నీరుగట్టువారిపల్లె రామిరెడ్డి లేఅవుట్‌కు చెందిన అమర(36) ములకలచెరువు మండలం వేపూరికోట పంచాయతీ దారంవారిపల్లెలో కౌలుకు టమటా పంట సాగు చేస్తున్నాడు. గురువారం పంటకు మందులు పిచికారీ చేసేందుకు తానే స్వయంగా స్ప్రేయర్ తీసుకున్నారు. పిచికారీ చేస్తుండగా ప్రమాదశాత్తు పేలింది. అమర తీవ్రంగా గాయపడడంతో స్థానికులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఎంపీటీసీ నుంచి జెడ్పీ చైర్మన్ దాకా..



రామగోవిందరెడ్డి

బ్రహ్మంగారిమఠం : మైదుకూరు నియోజకవర్గంలో వెనుకబడిన బ్రహ్మంగారి మఠం మండలం నుంచి రాజకీయాల్లో రాణిస్తున్నారు రామగోవిందరెడ్డి. ఎంపీటీసీగా ఎన్నికై రాజకీయాల్లో పట్టు సాధించిన ఆయన నేడు జెడ్పీ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. మండలంలోని పలుగురాళ్లపల్లె పంచాయతీ జౌకుపల్లె గ్రామానికి చెందిన ముత్యాల పిచ్చిరెడ్డి మునుసూబుకు 1962 ఫిబ్రవరి, ఒకటో తేదీన ముత్యాల రామగోవిందరెడ్డి జన్మించారు. ఆయన విద్యాభ్యాసం ఒక టి నుంచి ఐదో తరగతి వరకు జౌకుపల్లె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, ఆరు నుంచి పదో తరగతి వరకు పలుగురాళ్లపల్లె జెడ్పీ హైస్కూల్‌లో కొత్తపల్లెకు చెందిన పుట్టా సుధాకర్‌యాదవ్ (ఎమ్మెల్యే)తో కలిసి ఆయన చదువుకున్నారు. ప్రస్తుతం పుట్టా పెద్ద కుమారుడుడు వేలూరు ఎంపీగా ఉన్నారు. పోరుమామిళ్లలో ఇంటర్మీడియట్ చదివి తరువాత 1984లో 23 ఏళ్లలో క్లాస్–1 కాంట్రాక్టర్‌గా పనులు చేపట్టారు. 2006లో అప్పటి కాంగ్రెస్ పార్టీ తరపున పలుగురాళ్లపల్లె ఎంపీటీసీగా ఏకగ్రీవమయ్యారు. మాజీ సీఎం జగన్, ఎంపీ అవినాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డిల ఆధ్వర్యంలో 2014లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాడు, బి.మఠం జెడ్పీటీసీగా పోటీచేసి టీడీపీ అభ్యర్థి చెంచయ్యగారిపల్లెకు చెందిన పోలిరెడ్డిపై 5000 మెజార్టీతో గెలిచాడు, అప్పుడే జెడ్పీ చైర్మన్ కోసం ప్రయత్నాలు చేసినా దక్కలేదు. 2019లో మళ్లీ జెడ్పీటీసీగా పోటీ చేసి ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. రాజకీయ సమీకరణాలతో అప్పటి సీఎం జగన్ రాజంపేటకు అవకాశం ఇచ్చారు. అనంతరం నేడు ఆయన జెడ్పీ చైర్మన్‌గా అవకాశం దక్కింది. ఇదే పంచాయతీలో మరొరు ఎమ్మెల్యేగా ఉంటే ఈయన జెడ్పీ చైర్మన్‌గా ఎన్నికవడం విశేషం. 40 మంది జెడ్పీటీసీల సభ్యుల ఆమోదంతో జెడ్పీ చైర్మన్ పీఠం ఎక్కారు. రామగోవిందరెడ్డికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉండగా అందరికీ వివాహమైంది.